గురువారం 22-08-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 432 పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



మృత్యువుతో పోరాడుతున్న భర్త వీర్యం కావాలి

మిగతా 2లో



అమెరికాలో భారతీయ వైద్యుడు వికృత చేష్టలు

మిగతా 2లో




దేశవ్యాప్తంగా 21 ఫేక్ యూనివర్శిటీలు

మిగతా 3లో



చర్లపల్లి నుంచి నడవబోతున్న రైళ్లు

మిగతా 4లో

## 45 ఏళ్ల తర్వాత పోలెండ్‌కు మోడీ

### 1979లో మొరార్జీ దేశాయ్ సందర్శన

ముందడుగు జాతీయం:

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనలో భాగంగా పోలెండ్ చేరుకున్నారు. భారత్, పోలెండ్‌ల మధ్య దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోడీ అక్కడ పర్యటిస్తున్న విషయం తెలిసిందే. గత 45ఏళ్లలో భారత ప్రధాని పోలెండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. చివరిసారిగా 1979లో నాటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలెండ్‌ను సందర్శించారు.



రెండు రోజులపాటు పోలెండ్‌లో పర్యటించనున్న మోడీ.. అక్కడ నుంచి ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఆగస్టు 23న ప్రత్యేక రైలులో సుమారు 10 గంటలు ప్రయాణించి కీవ్ చేరుకుంటారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమై తిరిగి మళ్లీ రైలు మార్గంలోనే పోలెండ్ చేరుకుంటారు. అనంతరం పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగొస్తారు. తన విదేశీ పర్యటన రెండు దేశాలతో విస్తృతమైన సంబంధాలకు ఉపయోగపడుతుందని, రాబోయే రోజుల్లో మరింత శక్తివంతమైన బంధాన్ని నెలకొల్పడానికి దోహదపడుతుందని తాను విశ్వసిస్తున్నట్లు భారత్ నుంచి బయలుదేరే సమయంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా ఉక్రెయిన్-రష్యా మధ్య కొనసాగుతున్న యుద్ధం వేళ ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## నా మిత్రుడి ఫాంహౌస్ లీజుకు తీసుకున్నా

- తన పేరుమీద ఎలాంటి ఫాంహౌస్ లేదు
- బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



ముందడుగు తెలంగాణ:

హైదరాబాద్ నగరంలో హైడ్రా పేరుతో అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే తనకు ఏ ఇబ్బందీ లేదని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తన పేరుమీద ఎలాంటి ఫాంహౌస్ లేదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పు తాను చేసినా, కాంగ్రెస్ వాళ్లు చేసిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. "నా మిత్రుడికి ఉన్న ఫాంహౌస్‌ను లీజుకు తీసుకున్నా. తప్పు ఉండి

మిగతా 2లో

## నా బిడ్డ కలలు ఒక్కరాత్రిలో చెదిరిపోయాయి

- డాక్టర్ అయ్యేందుకు ఎంతో కష్టపడింది
- పశ్చిమబెంగాల్ వైద్యురాలి తండ్రి ఆవేదన

ముందడుగు పశ్చిమ బెంగాల్:

తమది నిరుపేద కుటుంబమని, అయినప్పటికీ డాక్టర్ అయ్యేందుకు తమ కూతురు ఎంతో శ్రమించిందన్నారు. చదువే లోకంగా బతికిందని.. కానీ, చివరకు ఒక్క రాత్రిలోనే కలలన్నీ చెదిరిపోవడం, తమ హృదయాలను కదిలిస్తోందని పశ్చిమబెంగాల్ వైద్యురాలి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. "డాక్టర్ అయ్యేందుకు ఆమె ఎంతో కష్టపడింది. చదువే లోకంగా బతికింది. చివరకు ఆమె అనుకున్నది సాధించడంతో ఎంతో




సంతోషించాం. వైద్యవృత్తితో ఎంతోమందికి సహాయం చేయవచ్చని తమతో చెప్పింది.

మిగతా 2లో

## సామాజిక అంతరానికి ఈకామర్స్ కారణం

### ఈకామర్స్ సంస్కృతిపై కేంద్రమంత్రి ఆందోళన



ముందడుగు జాతీయం:

దేశంలో పుట్టగొడుగుల్లా శరవేగంగా విస్తరిస్తున్న ఈ-కామర్స్ సంస్కృతిపై కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ తరహా సంస్థలు పుట్టుకొస్తుండటాన్ని

మిగతా 2లో

ముందడుగు
గురువారం, 22-08-2024, హైదరాబాద్

## నా బిడ్డ కలలు ఒక్కరాత్రిలో
# చెదిరిపోయాయి

(మొదటిపేజీ తరువాయి)

కానీ, ఇప్పుడేం జరిగిందో చూడండి. కలలన్నీ ఒక్క రాత్రిలోనే చెదిరిపోయాయి. విధుల నిర్వహణ కోసం ఆమెను పంపిస్తే.. ఆస్పత్రి మాత్రం తమకు విగతజీవిగా అప్పగించింది. మా పని ముగిసిపోయింది. మా అమ్మాయి ఇక తిరిగి రాదు. ఆమె స్వరాన్ని, చిరునవ్వునూ నేనెప్పటికీ వినలేను. మేం ఇప్పుడు చేయగలిగేది ఆమెకు న్యాయం జరిగేలా చూడటమే" అని ఓ అంతర్జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వైద్య విద్యార్థిని తండ్రి వాపోయారు.

## నా మిత్రుడి ఫాంహౌస్
# లీజుకు తీసుకున్నా

(మొదటిపేజీ తరువాయి)

కూల్చివేస్తే నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉంటే నేనే కూల్చివేయిస్తా. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. మంత్రులు, కాంగ్రెస్ నేతలు కట్టిన ఫాంహౌస్‌లు చూపిస్తా. మంత్రి పొంగులేటి, నేతలు కేవీపీ, పట్నం మహేందర్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డికి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. సీఎం రేవంత్‌కు కూడా ఫాంహౌస్ ఉంది. తప్పు జరిగితే కూల్చివేతకు దగ్గరుండి సహకరిస్తా" అని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ కోసం ఆందోళన చేస్తున్న రైతులపై కేసులు నమోదు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ జరగలేదని మంత్రులే చెబుతున్నారని.. ఈ విషయంలో వారికే సమన్వయం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసానికి వ్యతిరేకంగా భారాస ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని.. ఎప్పటిలోపు పూర్తిచేస్తారో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## మృత్యువుతో పోరాడుతున్న
# భర్త వీర్యం కావాలి

- హైకోర్టును ఆశ్రయించిన మహిళ
- వీర్యం సేకరించి, భద్రపరచడానికి కోర్టు అనుమతి

ముందడుగు జాతీయం:



ప్రాణాపాయ స్థితిలో ఉన్న భర్త నుంచి వీర్యం కావాలని సంతానం లేని ఓ మహిళ పిల్లలను కనడానికి చేసిన అభ్యర్థనకు కేరళ హైకోర్టు కీలకమైన తీర్పు వెలువరించింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న భర్త నుంచి వీర్యం సేకరించి, భద్రపరచడానికి అనుమతినిచ్చింది. కేరళకు చెందిన ఓ మహిళ తన భర్త వీర్యాన్ని భద్రపరచడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా కేరళ హైకోర్టును ఆశ్రయించింది. కొద్ది కాలంగా తన భర్త తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాడని, తమకు ఇప్పటి వరకు సంతానం లేదని ఆమె పేర్కొంది. కాబట్టి భవిష్యత్తులో తాను సంతానాన్ని కనడానికి ఉపయోగపడేలా భర్త వీర్యాన్ని భద్రపరచడానికి అనుమతించాలని కోర్టును కోరింది. భర్త పరిస్థితి విషమంగా ఉండడం వల్ల అతడి రాతపూర్వక సమ్మతిని తీసుకురాలేకపోయానని పేర్కొంది. ఆలస్యం చేస్తే పరిస్థితి మరింత దిగజారి అతడు మరణించే ప్రమాదముందని.. వెంటనే తమకు న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. ఆ అభ్యర్థనను స్వీకరించిన న్యాయమూర్తి జస్టిస్ వీజీ అరుణ్ ఆ దంపతులకు తాత్కాలిక ఉపశమనం కలిగించారు. భర్త నుంచి వీర్యం సేకరించి, భద్రపరచడానికి కోర్టు అనుమతిచ్చింది. దానికి మినహా మరే ఇతర ప్రక్రియలు చేపట్టవద్దని ఆంక్షలు విధించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 9వ తేదీన చేపట్టనుంది.

## అమెరికాలో భారతీయ వైద్యుడు
# వికృత చేష్టలు

### చిన్నారులు, మహిళల నగ్న వీడియోలు రహస్యంగా రికార్డ్

ముందడుగు అమెరికా:

అమెరికాలో ఉంటున్న ఓ భారతీయ వైద్యుడు గత కొన్నేళ్లుగా చిన్నారులు, మహిళల నగ్న చిత్రాలు, వీడియోలను రహస్యంగా రికార్డ్ చేస్తూ వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఎట్టకేలకు భార్య ఫిర్యాదుతో అతడి అరాచకాలు వెలుగులోకి రావడంతో ఇటీవల ఆక్లాండ్ కౌంటీ పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌కు చెందిన ఒయిమెయిర్ ఎజాజ్ 2011లో వర్క్ వీసాపై అమెరికా వెళ్లాడు. తొలుత కొన్నేళ్ల పాటు అలబామాలో నివాసమున్న అతడు 2018లో మిషిగాన్‌కు మకాం మార్చాడు. ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని పలు ఆసుపత్రుల్లో ఫిజీషియన్‌గా పనిచేస్తున్నాడు. అయితే, గత కొన్నేళ్లుగా అతడు లైంగిక దారుణాలకు పాల్పడ్డాడు. తాను పనిచేసే చోట ఆసుపత్రి గదులు,



బాత్రూమ్‌లు, చేజింగ్ ఏరియా వంటి ప్రదేశాల్లో రహస్యంగా కెమెరాలు పెట్టి అనేక మంది మహిళలు, చిన్నారుల నగ్న వీడియోలను రికార్డ్ చేశాడు. మహిళలు స్పృహలో లేనప్పుడు వారిపై అభ్యంతరకరంగా ప్రవర్తించి ఆ దృశ్యాలను రికార్డ్ చేసేవాడు. ఆసుపత్రుల్లో పేషెంట్లను కూడా లైంగిక వేధించేవాడని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల అతడి భార్యకు ఈ విషయం తెలియడంతో ఆ వీడియోలను తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆగస్టు 8న పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

### సామాజిక అంతరానికి
# ఈకామర్స్ కారణం

(మొదటిపేజీ తరువాయి)

గొప్ప విజయంగా భావించకూడదని, ఇది ఆందోళన చెందాల్సిన విషయమని `సంక్షేమంపై ఇ-కామర్స్ ప్రభావం' అనే నివేదిక విడుదల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ఇ-కామర్స్ సంస్థలు సామాజిక అంతరానికి కారణమవుతున్నాయని పీయూష్ గోయల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇ-కామర్స్ నెట్‌వర్క్ వల్ల రాబోయే పదేళ్లలో సగం మార్కెట్ అవే ఆక్రమించడాన్ని విజయంగా భావించకూడదని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఇ-కామర్స్ సంస్థలు పోటీని నివారించేందుకు అనుసరిస్తున్న ధరల విధానం వల్ల సంప్రదాయ రిటైల్ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ తరహా ధరల విధానం దేశానికి మంచిదా..? అని ప్రశ్నించారు.

## ఐదుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారిణీ

### ఆహారం గొంతులో ఇరుక్కొని ఊపిరాడక మృతి

ముందడుగు క్రీడలు:

సైక్లింగ్ లెజెండ్ డ్యానియెలా లారియల్ కిరినోస్ అమెరికాలోని లాస్ వెగాస్‌లో అనుమానాస్పదరీతిలో మృతి చెందారు. ఆమె వెనెజువెలా తరపున ఐదుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు. లాస్ వెగాస్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఆమె మృతదేహం లభ్యమైంది. అయితే భోజనం చేస్తుండగా ఆహారం గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరాడక మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. 50 ఏళ్ల డ్యానియోలా 1992- 2012 వరకు ఒలింపిక్ క్రీడల్లో వెనెజువెలా తరఫున పాల్గొన్నారు. సైక్లింగ్ లెజెండ్ డ్యానియెలా మృతి ఆమె అభిమానులతో పాటు క్రీడా ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. వెనెజువెలా ఒలింపిక్ కమిటీ ఎక్స్‌వేదికగా ఆమెకు నివాళులర్పించింది.

1992- 2012 వరకు ఒలింపిక్ క్రీడల్లో సైక్లింగ్‌లో పోటీ పడింది. 2002లో సెంట్రల్ అమెరికన్, కరీబియన్ గేమ్స్‌లో రెండు



బంగారు పతకాలు, 2003లో పాన్ అమెరికన్ గేమ్స్‌లో రెండు రజత పతకాలు సాధించింది. దేశంలోని పలువురు రాజకీయ నాయకులపై విమర్శలు చేయడంతో దేశ బహిష్కరణకు గురయ్యింది. దీంతో ఆమె అమెరికాలోని లాస్ వెగాస్‌లోని ఓ హోటల్‌లో ఫుడ్ సర్వర్‌గా పనిచేస్తోంది.

ముందడుగు
గురువారం,
22-08-2024,
హైదరాబాద్

# పొరపాటున డిప్యూటీ కలెక్టర్‌పై లాఠీచార్జ్

## క్షమాపణలు చెప్పిన పోలీసులు



ముందడుగు బీహార్:
దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం భారత్ బంద్‌కు రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి పిలుపునిచ్చింది. అయితే ఆందోళనకారులను చెదరగొట్టే క్రమంలో ఒక పోలీస్ పొరపాటున జిల్లా డిప్యూటీ కలెక్టర్‌పై లాఠీచార్జ్ చేశాడు. బీహార్ రాజధాని పాట్నాలో ఈ సంఘటన జరిగింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఆందోళనకారులు భారత్ బంద్ పాటించేందుకు ప్రయత్నించారు. పోలీస్ బారికేడ్లను దాటుకుని పాట్నాలోని డాక్ బంగ్లా వద్దకు చేరుకున్నారు. పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు, భద్రతా దళాలు ప్రయత్నించాయి. ఈ సందర్భంగా ఆందోళనకారులను చెదరగొట్టేందుకు వాటర్ కెనాన్ ప్రయోగించడంతోపాటు లాఠీ చార్జ్ చేశారు. అయితే సివిల్ డ్రెస్‌లో ఉన్న పాట్నా జిల్లా డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీఎం) శ్రీకాంత్ కుండ్లిక్ ఖండేకర్‌ను కూడా ఆందోళనకారుడిగా ఒక పోలీస్ పొరపాటుపడ్డాడు. ఆయనను కూడా లాఠీతో కొట్టాడు. మరోవైపు పక్కనే ఉన్న పోలీస్ అధికారులు, ఇతర పోలీస్ సిబ్బంది వెంటనే స్పందించారు. ఎస్‌డీఎంపై లాఠీ చార్జ్ చేసిన పోలీస్‌ను పక్కకు తీసుకెళ్లారు. ఆయన ఎస్‌డీఎంగా చెప్పగా ఆ పోలీస్ క్షమాపణలు చెప్పాడు.

# 37ఏళ్లు బంగ్లాదేశ్ జైల్లో గడిపిన వ్యక్తి

## భారత్‌కు తిరిగి వచ్చిన వ్యక్తి

ముందడుగు జాతీయం:
భారత్‌కు చెందిన ఒక వ్యక్తి బంగ్లాదేశ్ జైళ్లలో 37 ఏళ్లు గడిపాడు. చివరకు ఒక సంస్థ సహకారంతో భారత్‌కు తిరిగి వచ్చాడు. 62 ఏళ్ల వయసులో కుటుంబ సభ్యులను కలుసుకుని సంతోషం వ్యక్తం చేశాడు. పెద్ద వాడైన కుమారుడ్ని చూసి ఆనందం పట్టలేకపోయాడు. త్రిపురలోని సెపాహిజాలా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోనామురా సబ్‌డివిజన్‌లోని సరిహద్దు గ్రామం రవీంద్రనగర్‌లో నివసిస్తున్న 25 ఏళ్ల షాజహాన్, 1988లో బంగ్లాదేశ్ కొమిల్లాలోని తన అత్తమామల ఇంటికి వెళ్లాడు. అయితే ఆ ఇంటిపై బంగ్లాదేశ్ పోలీసులు రైడ్ చేశారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించినందుకు షాజహాన్‌ను అరెస్ట్ చేశారు. ఆ సమయంలో ఆయన భార్య గర్భవతి.



బంగ్లాదేశ్‌లోని కొమిల్లా కోర్టు షాజహాన్‌కు 11 ఏళ్లు జైలు శిక్ష విధించింది. ఆ జైలు శిక్ష ముగిసినప్పటికీ అతడిని విడిచిపెట్టలేదు. తప్పుడు ఆరోపణలతో ఇతర జైళ్లకు తరలించారు. దీంతో అదనంగా 26 సంవత్సరాలు బంగ్లాదేశ్ జైళ్లలో గడిపాడు. ఈ నేపథ్యంలో షాజహాన్‌కు జరిగిన అన్యాయం గురించి మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో అతడి దుస్థితి గురించి జారా ఫౌండేషన్‌కు తెలిసింది. మరోవైపు విదేశాల్లో చిక్కుకున్న వలసదారులకు సహాయం చేసే ఈ సంస్థ షాజహాన్ విడుదలకు చాలా కృషి చేసింది. అనేక చట్టపరమైన చర్యల తరువాత బంగ్లాదేశ్ పోలీసులు, అధికారులు అతడ్ని విడుదల చేశారు.

# 10 వేలకుపైగా వందేళ్లు దాటిన వృద్ధులు

- ఓటు వేయబోయే వృద్ధుల జాబితా విడుదల
- ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఈసీ

ముందడుగు హర్యానా:
హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ఈసీ తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్రంలో ఈసారి ఓటు వేయబోయే ఓటర్లలో 10 వేలకు పైగా వందేళ్లు దాటిన వృద్ధులు ఉన్నారు. దీంతో ఈసీ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. హర్యానాలో 100 ఏళ్లు పైబడిన ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్రానికి పొరుగునే ఉన్న పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌ల కంటే ఎక్కువగా ఉన్నట్లు ఈసీ గుర్తించింది. దీంతో ఎన్నికల అధికారులు ఇప్పుడు బూత్ స్థాయిలో డేటాను నిర్ధారించేందుకు అధికారులను పంపుతున్నారు. హర్యానాలో అక్టోబర్ 1న ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో రాష్ట్రంలోని 9,554 మంది ఓటర్లు 100 ఏళ్లు పైబడిన వారని హర్యానా ముఖ్య ఎన్నిక అధికారి పంకజ్ అగర్వాల్ తెలిపారు. దీంతో అనుమానం వచ్చి పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ లో ఆరా తీశారు. ఇందులో పంజాబ్‌లో 4,116 మంది వందేళ్లు పైబడిన ఓటర్లు ఉన్నారని, హిమాచల్ ప్రదేశ్‌లో 1,216 మంది ఉన్నారని తేలింది. దీంతో ఈసీ సందేహాలు వ్యక్తం చేస్తూ తదుపరి విచారణకు ఆదేశించింది. శతాధిక వృద్ధుల డేటాను తిరిగి నిర్ధారించాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు. ఎందుకంటే ఈ సంఖ్య అసాధారణంగా ఉన్నట్లు తేల్చారు. వీరి సంఖ్యపై ఈసీ సంతృప్తి చెందలేదని, అందువల్ల బూత్ స్థాయి అధికారుల సహాయంతో ధృవీకరణ చేయాల్సి ఉందన్నారు.

# దేశవ్యాప్తంగా 21 ఫేక్ యూనివర్శిటీలు

- ఢిల్లీలో అత్యధికంగా ఫేక్ యూనివర్శిటీలు
- ఏపీలో రెండు నకిలీ యూనివర్శిటీలు

ముందడుగు జాతీయం:
యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ దేశంలోని నకిలీ యూనివర్సిటీలకు సంబంధించిన డేటాను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 21 ఫేక్ యూనివర్సిటీలు ఉన్నాయని యుజీసి ప్రకటించింది. ఇందులో ఏపీలో రెండు యూనివర్సిటీలు ఉన్నాయని తెలిపింది.

### దేశంలో 21 నకిలీ యూనివర్సిటీలు

ఈ సంవత్సరం మే నాటికి దేశంలో 21నకిలీ యూనివర్సిటీలు ఉన్నట్టు గుర్తించిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఈ యూనివర్సిటీలు జారీచేసే డిగ్రీలు చెల్లుబాటు కావని పేర్కొంది. ఈ యూనివర్సిటీలకు డిగ్రీలు ప్రధానం చేసే అధికారం లేదని వెల్లడించింది. ఇక దేశవ్యాప్తంగా ఉన్న నకిలీ యూనివర్సిటీలలో దేశ రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 8యూనివర్సిటీలు ఉన్నాయని, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు, ఏపీ, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో రెండు చొప్పున ఉన్నాయని యుజిసి పేర్కొంది.

### ఏపీలో రెండు నకిలీ యూనివర్సిటీలు

అంతేకాదు కర్ణాటక, పుదుచ్చేరి, మహారాష్ట్రలో ఒక్కొక్క యూనివర్సిటీ చొప్పున ఫేక్ యూనివర్శిటీలు ఉన్నట్టుగా వెల్లడించింది. ఇక యుజిసి ప్రకటించిన నకిలీ విశ్వవిద్యాలయాల జాబితా విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గుంటూరు కాకుమాను వారి తోటలో ఉన్న క్రైస్ట్ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ, విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియా 2 నకిలీ యూనివర్సిటీలుగా తేల్చింది.

### ఢిల్లీలో అత్యధికంగా ఫేక్ యూనివర్సిటీలు

దేశ రాజధాని ఢిల్లీలో ఢిల్లీ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయం, ఢిల్లీ కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్ దర్యాగంజ్, ఢిల్లీ ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం, ఢిల్లీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఢిల్లీ ఒకేషనల్ యూనివర్సిటీ, ఢిల్లీ ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్, ఢిల్లీ ఏడిఆర్ సెంట్రిక్ జ్యురిడికల్ యూనివర్సిటీలు ఫేక్ యూనివర్సిటీలని తేల్చింది.

ముందడుగు
గురువారం,
22-08-2024,
హైదరాబాద్




### డీప్ లెర్నింగ్ పవర్డ్ హెల్త్ మానిటరింగ్ యాప్

# క్విక్ వైటల్స్ ఆవిష్కరణ...

### ప్రపంచంలోని ఈ తరహా యాప్‌ను హైదరాబాద్‌లో ఆవిష్కరణ..

ముందడుగు హైదరాబాద్ :
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్ ప్రపంచం ఇప్పుడు ఆరోగ్య సంరక్షణలో పురోగతిని సాధిస్తోంది. స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్ ద్వారా కీలకమైన హెల్త్ డేటాను పర్యవేక్షిస్తూ, తనిఖీ చేయడానికి, సమగ్ర సమాచారాన్ని అందించడానిక బిసాన్ ఫార్మాస్యూటికల్స్ ఆధ్వర్యంలో ప్రపంచంలోని మొట్టమొదటి ఏఐ-ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ యాప్ "క్విక్ వైటల్స్"ను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లోని హోటల్ అవసా వేదికగా బుధవారం బిసాన్ ఫార్మాస్యూటికల్స్ వ్యవస్థాపకులు, ఎండీ హరీష్ బిసామ్ ఆధ్వర్యంలో క్విక్ వైటల్స్ యాప్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్లానింగ్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ చిన్నా రెడ్డి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డా. సుధ, డ్రగ్ కంట్రోల్ అథారిటీ మాజీ డైరెక్టర్ డా. పి. వెంకటేశ్వర్లు, డా. పూర్ణిమ, ఇన్నోవేటర్-ప్రొడక్ట్ స్పెషలిస్ట్ డేనియల్ గోల్డ్‌మన్, కాటలిస్ట్ వ్యవస్థాపకులు ఆండ్రూ షోస్టాక్, డాక్టర్ ఉషతో పాటు టెక్ ఔత్సాహికులు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ ఆవిష్కరణ నేపథ్యంలో ఏఐ మరియు డీప్ లెర్నింగ్: ది ఫ్యూచర్ ఆఫ్ హెల్త్‌కేర్ పై ప్రత్యేకంగా ప్యానెల్ చర్చను నిర్వహించారు.

# చర్లపల్లి నుంచి నడవబోతున్న రైళ్లు

### సికింద్రాబాద్ నుంచి నేరుగా చర్లపల్లి ▪ దశలావారీగా పెరగనున్న 50 రైళ్లు

ముందడుగు రైల్వే:
దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్ల నుంచి ప్రతిరోజు 200 రైళ్ల ద్వారా దాదాపు రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మూడు స్టేషన్లపై ఉన్న ఒత్తిడిని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ స్టేషన్ గా అధికారులను చర్లపల్లిని అభివృద్ధి చేస్తున్నారు. దాదాపు రూ.450 కోట్ల వ్యయంతో టెర్మినల్ నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. తొమ్మిది ప్లాట్ ఫారాలు అందుబాటులోకి వచ్చాయి. సెప్టెంబరు మొదటివారంలో ప్రారంభించాలనే యోచనలో అధికారులున్నారు.




## దశలవారీగా 50కి పెంచుతారు

ప్రతిరోజు 50 రైళ్లను ఇక్కడి నుంచి నడిపించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభంలో 25 రైళ్లు నడుస్తాయి. దశలావారీగా దీన్ని 50 రైళ్లకు పెంచుతారు. చర్లపల్లికి చేరుకునేందుకు మౌలాలి-సనత్ నగర్ మార్గం కూడా పూర్తయింది. మేడ్చల్, మల్కాజిగిరి, ఫలక్ నుమా, లింగంపల్లి ప్రాంతాల ప్రజలు ఎంఎంటీఎస్ ద్వారా నేరుగా చర్లపల్లికి చేరుకోవచ్చు. ఆయా ప్రాంతాల ప్రజలు రోడ్డుమార్గంద్వారా చర్లపల్లిని చేరుకునేందుకు కొన్ని రహదారులను విస్తరిస్తున్నారు.

## మౌలాలి మీదుగా చర్లపల్లికి

కృష్ణా ఎక్స్ ప్రెస్, శాతావాహన, ఇంటర్ సిటీ, గోల్కొండ, బీదర్-మచిలీపట్నం సూపర్ ఫాస్ట్, ముంబయి-భువనేశ్వర్ కోణార్క్, కాకినాడ-షిరిడీ ట్రైవీక్లీ, కాజీపేట-పూణె ట్రైవీక్లీ, కాకినాడ-లింగంపల్లి గౌతమి సూపర్ ఫాస్ట్, మచిలీపట్నం-షిరిడీ వీక్లీ ఎక్స్ ప్రెస్, టాటానగర్-యశ్వంత్ పూర్ వీక్లీ, లింగంపల్లి-కాకినాడ కోకనాడ ట్రైవీక్లీ, హైదరాబాద్-చెన్నై, షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్, గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ వీక్లీ సూపర్ ఫాస్ట్, జమ్ముతావి-తిరుపతి హమ్‌సఫర్ వీక్లీ, నిజాముద్దీన్ - బెంగళూరు సిటీ రాజధాని సూపర్ ఫాస్ట్ రైళ్లను చర్లపల్లి నుంచి నడిపించబోతున్నారు. త్వరలోనే రైళ్ల జాబితాను ప్రకటించనున్నారు. లింగంపల్లి నుంచి బయలుదేరే కొన్ని రైళ్లు సికింద్రాబాద్ వచ్చే అవసరం లేకుండా మౌలాలి మీదుగా చర్లపల్లికి చేరుకుంటాయి.




### ముఫాసా: ది లయన్ కింగ్‌కు

# మహేశ్ బాబు వాయిస్ ఓవర్.. ఇంతకీ ఏ పాత్రకో తెలుసా..?

హాలీవుడ్ సూపర్ హిట్ బ్లాక్ బస్టర్స్ ప్రాజెక్టుల్లో టాప్‌లో ఉంటుంది ది లయన్ కింగ్. ఈ క్రేజీ ప్రాజెక్టుకు ప్రీక్వెల్‌గా వస్తోంది ముఫాసా: ది లయన్ కింగ్ (Mufasa The Lion King). ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే విడుదల చేసిన ట్రైలర్ యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. కాగా ఈ మూవీ హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు బాలీవుడ్ యాక్టర్ షారుఖ్ ఖాన్ వాయిస్ ఓవర్ అందించాడని తెలిసిందే. ఇక తెలుగు వెర్షన్‌కు టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు వాయిస్ అందించాడు. తాజా సమాచారం ప్రకారం తెలుగు ట్రైలర్ ఆగస్టు 26న ఉదయం 11:07 గంటలకు లాంచ్ చేయనుండగా.. ఈవెంట్‌లో మహేశ్ బాబు సందడి చేయనున్నాడని సమాచారం. లయన్ కింగ్ సినిమాకు తెలుగుతోపాటు హిందీ ఆయా భాషల్లో పలువురు నటులు డబ్బింగ్ చెప్పారని తెలిసిందే. ఇక తెలుగు లయన్ కింగ్ లోని సింబా పాత్రకు నాని డబ్బింగ్ చెప్పాడు. ది లయన్ కింగ్‌లో మొదటి రెండు (The Lion King) పార్ట్‌లలో అడవికి రారాజుగా ఉన్న ముఫాసా తన రాజ్యాన్ని కాపాడుతూ ఉండడం అతడికి సింబా అనే కుమారుడు జన్మించడం చూడవచ్చు. అయితే ఈ ప్రీక్వెల్‌లో ముఫాసా అడవికి రాజుగా అసలు ఎలా ఎదిగాడు అతడికి సోదరుడు ఉన్న టాకా ఎలా చనిపోయాడు..? అలాగే ముఫాసా చంపాలని చూస్తున్నా స్కార్ ఏం చేశాడు..? అనేది సినిమా స్టోరీ. ఫొటో రియలిస్టిక్ టెక్నాలజీతో వస్తున్న ఈ సినిమాకు అకాడమీ అవార్డ్ విజేత బేరీ జెంకిన్స్ దర్శకుడు ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ముందడుగు
గురువారం,
22-08-2024,
హైదరాబాద్

# తమిళ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్..!

## సంచలన వ్యాఖ్యలు చేసిన యువ నటి సనమ్ శెట్టి

చిత్ర పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ కారణంగా తాము ఇబ్బందులు పడ్డామని పలువురు హీరోయిన్లు, నటీమణులు తెలిపారు. ఇండస్ట్రీలో తమకు ఎదురైన వేధింపులు, చేదు అనుభవాలను బయటపెట్టారు. మరికొందరు క్యాస్టింగ్ కౌచ్ వ్యవహారంపై పోరాటం చేస్తున్నారు. మరికొందరు తమకు అలాంటి ఇబ్బందులు ఎదురవలేవని చెబుతున్నారు. తాజాగా క్యాస్టింగ్ కౌచ్‌పై యువ నటి గొంతెత్తారు. తమిళ చిత్ర పరిశ్రమలోనూ నటీమణులకు ఇబ్బందులు తప్పడం లేదని సనమ్ శెట్టి తెలిపారు. పేరొందిన చిత్ర పరిశ్రమల్లో మాదిరిగానే తమిళ చిత్ర పరిశ్రమలో మహిళలు దర్శకులు, నిర్మాతల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తమిళ ఇండస్ట్రీలో మహిళలతో పాటు పురుషులపై సైతం లైంగిక వేధింపులు జరుగుతున్నాయంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కోల్‌కతాలో వైద్య విద్యార్థిని లైంగిక దాడి, హత్య ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగుతున్నాయి. వైద్య విద్యార్థిని లైంగిక హత్యాచార ఘటనను నిరసిస్తూ ర్యాలీ చేపట్టాలనుకుంటున్న సనమ్ తెలిపారు. ఈ మేరకు పోలీసులకు దరఖాస్తు చేసినట్లు చెప్పారు. అన్ని రంగాల్లోనూ మహిళలు వేధింపులను ఎదుర్కొంటున్నారన్నారు. మలయాళ చిత్ర పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొంటున్న క్యాస్టింగ్ కౌచ్‌ను ఉద్దేశించి ఇటీవల జస్టిస్ హేమ కమిటీ ఓ నివేదికను చేసిందని.. ఈ నివేదిక గురించి తెలిసి తాను షాక్ అయ్యాయని తెలిపారు. అవే పరిస్థితులు కోలీవుడ్‌లోనూ ఉన్నాయని.. వాటిని బయటపెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని.. తాను ఇలాంటి ఘటనలు ఎదుర్కొన్నానని చెప్పింది. అయితే, ఇలాంటి ఘటనలు ఎదురైనప్పడే ఎందుకు మాట్లాడారంటూ చాలా మంది అంటుంటారని.. కొన్ని పరిస్థితుల కారణంగా బయటకువచ్చి మాట్లాడలేమని సనమ్ చెప్పకొచ్చారు. రెండురోజుల కిందట పోస్ట్‌లో తన వ్యక్తిగత అనుభవం గురించి చెప్పానన్నారు. నాకు ఇదే సమస్య వచ్చిన సమయంలో అడ్జస్ట్‌మెంట్ అడిగిన వ్యక్తిని 'చెప్పుతో కొడతాను కుక్క' అని చెప్పి ఫోన్ కట్ చేశానన్నారు. అయితే, తమిళ ఇండస్ట్రీలో ఉన్న వారంతా చెడ్డవారు కాదని.. కొందరు తప్పుడు అర్థంతో మాట్లాడుతున్నారన్నారు. తాను ప్రస్తుతం చేసిన ప్రాజెక్టుల్లో వందశాతం మంచి వ్యక్తులు ఉన్నారని చెప్పింది. సనమ్ శెట్టి మొదట మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించింది. మిస్ సౌత్ ఇండియా టైటిల్‌ను నెగ్గింది. 2012లో తమిళ మూవీ 'అంబులి' మూవీతో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తమిళం, మలయాళం, కన్నడ, తెలుగు సినిమాల్లో నటించింది. తెలుగులో శ్రీమంత్రుడు, సింగం 123, ప్రేమికుడు సినిమాల్లో నటించింది.





# కాలంతో ప్రయాణించే ప్రియుడు

ప్రేక్షకులకు ఆసక్తిని కలిగించే కథల్లో టైమ్ ట్రావెల్ నేపథ్యంలోని కథలు ముందు వరుసలో ఉంటాయి. 'ఆదిత్య 369' నుంచి సౌత్ సినిమాలో ఈ తరహా కథలు అడపా దడపా పలకరిస్తూనే ఉన్నాయి. త్వరలో 'LIK' పేరుతో ఓ టైమ్ ట్రావెల్ మూవీ రానుంది. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనేది ట్యాగ్‌లైన్. ఒక మొబైల్ గాడ్జెట్‌ని ఉపయోగించి టైమ్ ట్రావెల్ అయ్యి, తన ప్రియురాలిని చేరుకున్న ప్రియుడు కథతో ఈ సినిమా రూపొందుతున్నది. ఇందులో ప్రియురాలుగా 'ఉప్పెన' భామ కృతి శెట్టి నటిస్తుంటే, ప్రియుడి పాత్రను 'లవ్ టుడే' ఫేం ప్రదీప్ రంగనాథన్ పోషిస్తున్నారు. అగ్రనటి నయనతార ఈ సినిమాకు నిర్మాత కావడం విశేషం. ఆమె భర్త విగ్నేష్ శివన్ దర్శకుడు. అనిరుధ్ సంగీత దర్శకుడు. రీసెంట్‌గా కోలీవుడ్‌లో ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. పింక్ కలర్ సోఫాలో పడుకొని, సిల్వర్ కలర్ స్కర్ట్‌లో స్టైలిష్‌గా కనిపిస్తున్న కృతిశెట్టి స్టిల్ ఇప్పుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. తెలుగులో ఆశించిన స్థాయిలో సక్సెస్‌లు లేకపోయినా.. కోలీవుడ్‌లో మాత్రం మంచి అవకాశాలనే దక్కించుకుంటున్నది కృతి శెట్టి.